క్లుప్తంగా

నవదిన వేడుకలు ప్రారంభం


ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఫాదర్

ఒంగోలు మెట్రో: స్థానిక పాత మార్కెట్ సెంటర్ వద్ద సెయింట్ థెరిస్సా చర్చిలో నవదిన వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెవరెండ్ ఫాదర్ గోన్ పీటర్ ముఖ్య గురువుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చ్ ఫాదర్ డీఎస్ పాల్, అసిస్టెంట్ ఫాదర్ హృదయరాజు, నీలంపాలెం, అరవపాలెం సంఘ పెద్దలు గద్దం మాణిక్యమ్మ పాల్గొన్నారు.

యవ్వన దశలో సంక్రమించే వ్యాధులపై అవగాహన


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు సిటీ: యవ్వన దశలో సంక్రమించే వ్యాధులపై స్థానిక డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ కళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధానంగా ప్రీ మెన్సురల్ సిండ్రోం, పోలిసిస్టిక్ ఒవేరియన్, సర్వైకల్ క్యాన్సర్ తదితర వ్యాధులు సంక్రమించకుండా తీసుకునే జాగ్రత్తలు వివరించారు.

కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ కె.ప్రతాప్, వి.శ్రీలక్ష్మి, అరుణకుమారి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బాధితుల ధర్నాను జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 25వ తేదీన జరిగే ఎస్సీ, ఎస్టీ బాధితుల ధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ సూచించారు. సోమవారం ఒంగోలు నగరంలోని ఎల్బీజీ భవనంలో ఆ కార్యక్రమ కరపత్రాలను సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్, జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాఘవులు, వి.మోజెస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళిత, గిరిజనుల రక్షణ కోసం వచ్చిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లో అనేక లోపభూయిష్టమైన అంశాలను లేవనెత్తుతూ చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. దళిత, గిరిజనులకు రక్షణగా ఉన్న ఏకైక చట్టం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మాత్రమేనని చెప్పారు. జిల్లాలో ఉన్న అట్రాసిటీ బాధితులంతా ఈ కార్యక్రమానికి రావాలని వారు పిలుపునిచ్చారు.


బాలాజీరావుపేట కనకదుర్గాదేవి అమ్మవారు


బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరీదేవి


బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో గద్దలగుంట రాజరాజేశ్వరీదేవి



బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి


కేశవస్వామిపేట కనకదుర్గాదేవి ఆలయం వద్ద సెట్టింగ్

వైభవంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు


గంటాపాలెం పార్వతీదేవి అమ్మవారు


లాయరుపేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి

ఒంగోలు మెట్రో:

శరన్నవరాత్రి ఉత్సవాలకు సోమవారం ఉదయం అమ్మవారి ఆలయాల్లో అంకురార్పణ జరిగింది. పది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సకల శుభాలు కలిగించే అమ్మవారిని కొలిచేందుకు ఒంగోలు నగర ప్రజలు ప్రధాన వీధుల్లో మండపాలు ఏర్పాటు చేసుకుని నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఉదయం నుంచి మహిళా భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది.

సంప్రదాయ చీర కట్టులో అతివలు అమ్మవారి దర్శన పూజా క్రతువులో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, అధికారులు భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. అక్టోబర్ 2 వరకు జరిగే దసరా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నేటి నుంచి అమ్మవారి ఉపన్యాస యజ్ఞం ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు అమ్మవారి ఉపన్యాస యజ్ఞం నిర్వహించనున్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి తెలిపారు.

హరిహరక్షేత్రంలో...

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో సోమవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాల సందర్భంగా చీమకుర్తిలోని పలు ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. హరిహరక్షేత్రం ఆలయ ట్రస్ట్ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. చీమకుర్తిలోని ఇసుకవాగు సెంటర్‌లో సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


అంకమ్మపాలెం ఆలయంలో కాళికాదేవి కళారాన్ని పూజిస్తున్న మహిళలు


చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరాలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా..


చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


అచలానందాశ్రమంలో భక్తులు


రాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు


ఒంగోలు: కలశాల ఊరేగింపులో సీతారాంపురం భక్తులు


ఒంగోలు: గాంధీ రోడ్డు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కోలాటం

బీరంగుంటలో అంబేడ్కర్ స్థలం కబ్జా

- న్యాయం చేయాలని కలెక్టర్, తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బిల్లా చెన్నయ్య, గ్రామస్తులు

కొత్తపట్నం: మండలంలోని బీరంగుంటలో అంబేడ్కర్ స్థలాన్ని స్థానికుడు ఆక్రమించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 10 సెంట్ల స్థలంలో చుట్టూ హద్దు రాళ్లు వేసి ఆక్రమించుకున్నాడు. గ్రామస్తులంతా ఐక్యంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో, కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు అందజేశారు. వివరాలు.. బీరంగుంట అంబేడ్కర్ నగర్ వాసులు సర్వే నంబర్-2లో 60 సెంట్లు, సర్వే నంబర్- 4లో 10 సెంట్లు అంబేడ్కర్ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించుకున్నారు. దీనికి పంచాయతీ తీర్మానం కూడా తెచ్చుకున్నారు. ఇంతలో గ్రామానికి చెందిన గొట్టి కోటేశ్వరరావు దౌర్జన్యంగా 20 మందిని తీసుకొచ్చి సుమారు 10 సెంట్ల స్థలంలో హద్దు రాళ్లు వేయించుకున్నాడు. గ్రామానికి ఉపయోగపడే స్థలాన్ని ఆక్రమించుకోవడం సరైంది కాదని స్థానికులు పలుమార్లు చెప్పినా అతడు వినిపించుకోలేదు. కలెక్టర్ రాజాబాబు, తహసీల్దార్ శాంతి, ఎస్సై సుధాకర్‌బాబులకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. చెన్నయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ స్థలం కబ్జా చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జజ్జర సాంబయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బలిజల్లో ఏ కులాన్ని కలపొద్దు

ఒంగోలు వన్‌టౌన్: బలిజ కులంలో ఇతర ఏ కులాన్ని కలపొద్దని కాపు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాపు సంఘ అధ్యక్షుడు సంజీవకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొమ్మరి కులం పేరును గిరి బలిజగా మారుస్తూ జీఓ జారీ చేయడంతో బలిజ కులస్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆ జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


తాగునీటి సమస్యపై వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు నెరుసుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సంతనూతలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్ బాబురావుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులో పది వేల మందికిపైగా జనాభా ఉండగా, ప్రస్తుతం వారానికి ఒకరోజు తాగు నీటిని విడుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంతనూతలపాడు కేంద్రంలో రెండు చెరువులు, ఒక సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఉండి కూడా తాగునీటి సమస్య తలెత్తడం దారుణమన్నారు. సాగర్ నీటితో చెరువులను పూర్తి స్థాయిలో నింపకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రస్తుతం వారినికి ఓరోజు విడుదల చేస్తున్న నీరు కూడా కలుషితమై వస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, సీపీఎం మండల నాయకులు, ఎం.సుబ్రహ్మణ్యం, కోదాటి కోటేశ్వరరావు, తేళ్ల ప్రభుదాసు, వి.సంపత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

- ఆర్టీసీ బస్సు బోల్తా పడకుండా ఆపిన చెట్టు
- త్రుటిలో ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): వేగంగా వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన సంఘటన సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి ఆర్టీసీ బస్సు మార్జిన్‌లోకి దూసుకెళ్లి ఓ చెట్టును ఢీకొట్టి ఆగడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. ఆదివారం రాత్రి శ్రీశైలం నుంచి తిరుపతి వెళ్తున్న రాజస్థాన్ ట్రావెల్స్ ముందు వెళ్తున్న తిరుపతి ఆర్టీసీ బస్సును ఎండ్లూరు డొంక వద్ద దెబ్బతిన్న చప్టా ప్రాంతంలో ఢీకొట్టింది. ఇక్కడ స్పీడ్ బ్రేకర్ ఉండటం, రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ట్రావెల్స్ బస్సు వేగ నియంత్రణ కోల్పోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. మార్జిన్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని ఆగింది. అక్కడ చెట్టు లేకపోతే బస్సు బోల్తా పడి ప్రాణ నష్టం సంభవించి ఉండేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయని సంతనూతలపాడు ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం


అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల్లో పాలుపంచుకున్న గ్రామస్తులు

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలోని సామాజిక భవనం ప్రాంగణంలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ విగ్రహ ఏర్పాటులో గ్రామస్తులందరి సహకారం ఉందని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఒంగోలు సిటీ: ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒంగోలు కలెక్టరేట్ వద్ద దశల వారీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం వీఆర్ఏలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద మాట్లాడుతూ వీఆర్ఏల పేస్కేలు అమలు చేయాలని కోరారు. అర్హులైన వీఆర్ఏలకు అటెండర్లు, వీఆర్వోలుగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని, సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వివేకానంద హెచ్చరించారు.

బ్యాంకింగ్ రంగంపై అవగాహన

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ రంగంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.